అనే మాటలన్నీ అవి విసురుగా వెళ్ళిపోతున్న శంకర్ కేసి వింతగా చూస్తూ నిలబడి పోయింది సునీల.

'ఏమిటీ మనిషి? ఎలా అర్థం చేసుకోవాలితన్ని? ఇది పొరపాటు అనుకోవాలా? కావాలని చేసేదే అనుకోవాలా? ఇంతకంటే తను మాత్రం ఏం చేయగలుగుతుంది? ఎలా విప్పి చెప్పగలుగుతుంది?'

ఆమెకి నీలవయనాల్లో నీళ్ళు చెమర్చాయి. జరిగిన దంతా కళ్ళల్లో మెదిలింది. అందులో తన తప్పు ఎంతవరకు ఉన్నదో వితర్కించేసుకున్నది.

అతను మామూలుగానే ఆఫీసునుంచి వచ్చాడు. తనూ అలవాటు ప్రకారం కాఫీ, టిఫిను అందించింది. "మా నాన్న దగ్గిరనుండి లెటరు వచ్చిందా?" ఈ ప్రశ్న అడిగినప్పుడు తన మనసులో ఏ విధమైన కల్మషం లేదు. కానీ, దానికి అంత తీవ్రమైన సమాధానం వస్తుందని తెలిస్తే అసలామాట అడిగేదే కాదేమో!

"రోజూ ఈ పాఠం ఎందుకు? ఉత్తరం వ్రాస్తే నేనేం దాచుకుంటానా? ఆయనగారికి మనం గుర్తు ఉండవద్దూ!" విసుగు, కోపం మిళితమై ఉన్నాయి ఆ మాటల్లో.

ఆశించని సమాధానానికి ఒక్కక్షణం బిత్తర పోయింది సునీల. వెంటనే అభిమానం, రోషం తలెత్తాయి ఆమెలో.

"నే నిప్పుడేమన్నాను?" కళ్ళల్లో సుళ్ళు తిరుగు తున్న కన్నీటిని అపుకుంటూ అడిగింది.

"నువ్వేమీ అనలేదు! నేనే అన్నీ అంటున్నాను. ఇలాంటి వాడినని తెలియక చేసుకున్నావు. ఇప్పుడు దుఃఖిస్తే ఏం ప్రయోజనం?" ఉప్మా పూర్తిగా తినకుండానే చెయ్యి ప్లేటులో కడిగేసుకుని లేచాడు.

"ఎందుకింత విసుగు? అసలేమైందని?"

సమాధానం చెప్పకుండా అవతలి గదిలోకి వెళ్ళి పోయాడు శంకరం. అంతవరకూ బిగపట్టుకున్న ఓర్పు జారిపోయింది సునీలలో. తనూ మౌనంగా వంట ఇంట్లోకి వెళ్లిపోయింది. అనేకమైన ఆలోచనలు, బాధ, ఏడుపు అన్నీ కలగాపులగంగా ఆమెను ముంచెత్తుతున్నా విసురుగా పక్కకు నెట్టి వంటలో నిమగ్నమవ టానికి ప్రయత్నించింది. మధ్య, మధ్య శంకరం అన్నమాటలు గుర్తుకు వచ్చి శూలాల్లా ఆమె ఏకాగ్రతను భగ్నం చేశాయి. దానితో ఎంత ఆపుకున్నా ఆగని కన్నీళ్ళు జలజలా రాలాయి.

"భగవాన్, ఏమిటీ జీవితం? క్షణం ఆనందం, క్షణం దుఃఖం! ఏ భావమూ ఒక నిమిషమైనా నిలువదీ ఇంట్లో! ఏ ఘడియకు ఎలా మారిపోతాడో తెలియదు. ఈయనతో సర్దుకుపోవటం ఎలా? ఎలా భరించాలీ వేదనని?" కుమిలిపోయింది సునీల.

నిస్త్రాణ్యంగా కుర్చీలో జారగిలబడి, గోడకు తగిలించి ఉన్న పెళ్లిఫోటోవైపు తదేకంగా చూస్తున్న సునీల తలుపు తట్టిన శబ్దం విని, లేచి తలుపు తీసింది. శంకరం వచ్చాడు. సునీల మౌనంగా టేబుల్ పక్క ఉన్న పుస్తకాల బీరువాకు ఆనుకుని, టేబుల్‌మీద ఉన్న వారపత్రిక ముఖచిత్రంవైపు చూస్తూ నిలుచుంది.

ఆ ముఖచిత్రం వరూధిని!

ప్రవరుణ్ణి దీనంగా వేడుకునే వరూధిని!

'ఆదినుంచీ మగవాడికి దాసోహమని, కావాలని

ఆధునిక స్త్రీ ఆలోచనా స్రవంతికి అవధులు లేవు. స్వశక్తిమీద నిలబడగల ధీమా, హీనంగా అవమానిస్తే సహించలేని అభిమానం, ఎదుటి మనిషిని అర్థం చేసుకోగల ఆత్మవిశ్వాసం, సంస్కారం ఆమెను చైతన్యవంతం చేస్తున్నాయి. ఆ అభివృద్ధిని సహించలేని పురుషుడు భర్తగా లభిస్తే... మనసు వెన్నెల అయితే, కాఠిన్యం నీడ అవుతుందా?

---

తనకు తాను హీనపరచుకుని అతనిలోని అహంకారానికి ఆజ్యం పోసింది స్త్రీ!

ఇప్పుడు తనకు విలువ కావాలని ఏడిస్తే మాత్రం ఎక్కడినించి వస్తుంది?' సునీలలో ఏహ్యభావం తల ఎత్తింది. వరూధిని చూపులను భరించలేక పుస్తకం వెనక పక్కకు తిప్పింది.

"ఇవిగో పూలు" శంకరం చేయి ముందుకు చాపాడు. ఒక క్షణం ఆ చేయివైపు నిదానంగా చూసి, అతని ముఖంలోకి నిశితంగా చూసిందామె.

శంకరం వదనం నిర్మలంగా ఉన్నది. ఆయన్ని అప్పుడు ఎవరైనా చూస్తే, 'ఎంతో మంచివాడూ, అమాయకుడూ' అనే ఉద్దేశం తప్పితే మరో అభిప్రాయం తల ఎత్తదు.

సునీల తన చూపులను తిరిగి పూలవైపు మరల్చింది. 'తీసుకోనా?వద్దా? నిరాకరిస్తే చిన్నబుచ్చుకుంటారేమో! అయినా తృణీకారమెందుకిప్పుడు? జరిగినదాన్ని మళ్లీ కెలకటం వలన మనశ్శాంతిని కోల్పోవటం తప్పితే మరో ప్రయోజనం శూన్యం. భార్యాభర్తలమధ్య వైమనస్యం మంచిది కాదు.

కానీయ్! ఇది నా బలహీనత అనుకుంటాను! కాదు! స్త్రీలోని బలహీనతే ఇది!

ప్రత్యేకతకూడానేమో!'

చేతిలోని పొట్లం అందుకుని మల్లెపూలు దండ కడుతూ కుర్చీలో కూలబడింది సునీల.

వెనకవైపుగా వచ్చి ఆమె భుజాలమీద చేతులు వేసి ఆమె ముఖం పక్కగా తల వంచి,

"ఇంకా, కోపం పోలేదా?" అనునయంగా అడిగాడు శంకరం.

చిన్నగా బాధతో కూడిన మందహాసం చేసింది సునీల.

"నీలా! నన్ను క్షమించవూ!"

"ఎందుకు?" ప్రశ్నార్థకంగా అతని ముఖంవైపు తల తిప్పి చూసింది.

"అయితే నీకు కోపం లేదన్నమాట!"

"కోపం ఎందుకు? క్షమించటం ఎందుకు?— మీరు మీ తప్పు ఒప్పుకుంటున్నారా?"

---

## గొల్లపూడి రాజ్యలక్ష్మీరాఘవ్

---

"ఆఫీసునించి రాగానే ఎంతో విసుగ్గా ఉంటుంది. నీవు అలాంటి ప్రశ్న వేయగానే, నాకు కోపం రావటంలో తప్పేమీ లేదు." చేతులు వెనకకు కట్టుకుని పచార్లు చేస్తూ అన్నాడు శంకరం.

సునీల ఏమీ మాట్లాడలేదు. విస్మయంతో అతన్ని చూస్తూ కూర్చుంది. 'నాన్నదగ్గిరనుంచి ఉత్తరాలు వచ్చి చాలా రోజులయింది. ఎలా ఉన్నారో అనే ఆదుర్దా సహజం. ఆ ఆత్రతవల్ల అలగా అడిగింది. ఇందులో అతనంత చికాకు పడవలసిన అపరాధమేమిటో సునీలకు అర్థం కాలేదు.

అతని చికాకుకు కారణం అతనిలోనే ఉన్నది. అదే అహంకారం!' నిట్టూర్చుస్తూ అనుకున్న దామె.

• • •

"నీలా!, ఉత్తరం వచ్చింది! ఎక్కడినుంచో చెప్పుకో చూద్దాం!"

నీల మాట్లాడలేదు. అనుభవం నేర్పిన పాఠం ఆమెను మౌనంగా ఉండేలా చేసింది.

"నాన్న వ్రాశారు! మా అమ్మా నాన్నా వస్తారుట!" ఉత్సాహం, ఆనందం అతనిలో గంతులు వేస్తున్నాయి.

సునీల మౌనంగానే అతని ముఖంలోకి పరీక్షగా చూస్తూ నిలబడింది, ఏ భావాన్నీ వ్యక్తం కానీయక.

శంకరం ఆమెవైపు వింతగా చూశాడు. సునీల మౌనం అతనిలో ఎన్నో అర్థాలను' అనుమానాలను రేపింది.

"మాట్లాడవేం?" అడిగాడు.

"ఏం మాట్లాడను?" అతని కళ్లల్లోకి చూస్తూ అన్నది.

"అవును! ఏం మాట్లాడుతావు? వస్తున్నారని చెప్పగానే గుండెల్లో రాయిపడిందాయె!" రెట్టిస్తూ అన్నాడతను. సునీల నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయింది అతని మాటలు వింటూ.


"ఛీ, ఛీ! అత్తగార్లంటే కోడళ్లకింత అమాయ్యా, ద్వేషాలెందుకో? ఏం చేశారు నిన్ను? నీ ఇంట్లో ఉండరులే! దిగులుపడకు. వాళ్లేమంత గతి లేకుండా ఉన్నారనుకుంటున్నావేమో! నిన్ను చూసి, నీ మొహం చూసి వాళ్ళు రావటం లేదు... నా మీద ఉన్న వాత్సల్యాన్ని వదిలిపెట్టలేక వస్తున్నారు! వస్తున్నందుకు కాస్త మర్యాద దక్కించు!"

నీరింకి పోయిన కళ్లతో కంపిస్తున్న పెదవులతో అన్నది సునీల "నేను రావద్దన్నానా?"

"నీ ఆజ్ఞ ఎవరికి కావాలిట? అసలు వారిద్దరూ జీవితాంతం ఇక్కడే ఉంటారు. ఏం చేస్తావో చూస్తాను. నీకోసం వాళ్లను వదులుకోవటం కలలోని విషయం. పిచ్చి, పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు!"

అతని ధోరణిని అనటం ఆమెకు అలవాటే అయింది. ఏదో మాట్లాడాలని, తన మనసులో అలాంటి కుటిల భావాలు లేవనీ, తనది అలాంటి ఇరుకైన హృదయం కాదనీ చెప్పాలని ఆరాటపడింది. అతని మాటల్లోని తీవ్రత అతని ముఖంలోని తీక్షణత ఆమెను నోరు మెదప నివ్వలేదు. ఎంత నిగ్రహించుకున్నా ఆగని కన్నీరు మాత్రం కాళ్ళకు వస్తూంది.

"ఆడదానికి ఇన్ని కన్నీళ్ళు ఎందుకిచ్చాడో భగవంతుడు ఆమె సున్నిత మనస్తత్వానికి. చేతకానితనానికి నిదర్శనమే ఈ ఏడుపు. [illegible]



# నీడ

మంచితనాన్ని విగ్రహాన్ని ఎగం పాడుచేసేది కన్నీరే! సుశీల ప్రసక్తి లేకుండానే, ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి, శంకరం మాటల్లోని ప్రభావానికి.

కొంతసేపటికి ఆమెలో కొంత బాధ సర్దుకుంది. ఆలోచనలు ఆక్రమించాయి ఆ స్థానంలో. 'ఆయనకు అతనంటే అలాంటి భావం పాతుకుపోయి ఉండటానికి గల కారణం ఏమై ఉంటుంది? 'తనెప్పుడయినా అగౌరవంగా కించపరుస్తూ మాట్లాడిందా? అసలలాంటి ఉద్దేశం మనసులో ఉన్నదా? వాళ్ళ తన్నేం చేశారని సాధిస్తుంది? చేసినా సాధించే స్వభావం కాదే తనది!'

అత్తగారు మామగారు అంటే గౌరవం, సద్భావం తప్పితే మరో ఆలోచనకు తావేలేదు తన మనసులో. నిజం చెప్పాలంటే తన తల్లిదండ్రుల కంటేకూడా వారిని అభిమానిస్తుంది. మన్ని[illegible] ఇదే విషయాన్ని అతనికి ఎన్నిసార్లో ఉదాహరణంతో సహా సౌమ్యంగా నచ్చచెప్పింది. ఇప్పుడిలా మాట్లాడటంలోని అర్థమేమిటి? అతని మనసులోని అనుమానాల్ని నివృత్తి చేసుకోరాదా? అతనిలా హింసిస్తే ఏం లాభిస్తుంది?''

బట్టలు మార్చుకుని మళ్ళీ వీధిలోకి వెళ్ళిపోతున్న శంకరం కేసి చూస్తూ నిట్టూర్చింది సుశీల.

''ఎన్ని సంపదలు, ఎన్ని సుఖాలు, ఎంత అనురాగం

ఉండి ఏం ప్రయోజనం, మనశ్శాంతి కరువైన తరవాత?" విరక్తిగా అనుకున్నదామె.

రాత్రి బాగా పొద్దుపోయిన తరవాత వచ్చాడు శంకరం. చేతుల్లోని పాకెట్ టేబిల్‌మీద పెట్టి, "సీలా!" పిలిచాడు. అతని సమీపానికి వెళ్ళటానికి, మాట్లాడటానికి మనస్కరించలేదామెకు. మౌనంగా ముఖాన్ని దిండులో దాచుకుంది.

మళ్ళీ పిలిచాడు.

సమాధానం లేదు!

సుశీలను వెతుక్కుంటూ వంట ఇంట్లో చూశాడు. పెరట్లో చూశాడు కనిపించలేదు. గదిలో మంచం మీద బోర్లా పడుకుని దుఃఖాన్ని నిభాయించుకోటానికి విశ్వప్రయత్నం చేస్తున్న సుశీలను చూస్తూ అపరాధిలా కొన్ని క్షణాలు అలానే నిలబడ్డాడు. అతని మనసును పశ్చాత్తాపంలాంటి బాధ నులిమివేయ సాగింది. "సీలా!" అనునయంగా జుట్టు నిమురుతూ తల పైకెత్తటానికి ప్రయత్నించాడు. అతనికా అవకాశం ఇవ్వలేదామె. ఆమెలో అతనికి ప్రతికూలమైన భావాలు రేగుతున్నాయి.

"దయచేసి నన్ను తాకవద్దు! నా మనసు బాగుండలేదు." ఎరుపెక్కిన కళ్లతో ఒక క్షణం అతనివైపు చూసి మరల తల దించుకున్నది.

"కోపంలో ఏదో అన్నానే అనుకో! దానికింత శిక్ష విధించాలా సీలా!"

"క్షమించండి! మీకు శిక్ష విధించేంతటిదాన్నా? నే నెంత? నా కిలవెంత? ఒక పూలపొట్లం, ఒక చీర నా వ్యక్తిత్వంతో సమానం!"

"ఇప్పుడన్ని మాటలు ఎందుకు? నీ కేం తక్కువ చేశాను?" తలెత్తి అతనివైపు రోషంగా చూసిందామె.

"ఎంత తక్కువో మీకు తెలియదా? నాకు ఈ సంపద లేకపోయినా బాధపడేదాన్ని కాదు! మీ అపారమైన అనురాగం ముందు అన్నీ నిర్జీవమైనవనే నా సంకల్పం! అన్నీ ఉన్నాయి. అన్నీ తెస్తారు! ఎందుకివన్నీ, మనిషికి విలువన్నది లేకపోయిన తరవాత? ఎదటిమనిషికి ఆత్మాభిమానం ఉంటుందనే విషయాన్ని ఎందుకు గ్రహించరు? ఇష్టం వచ్చినట్లు చిదరించుకోటానికి నే నేం పశువునుకాదే!

"నాపై మీకు అంత అపనమ్మకం, అసహ్యం కలిగిన తరవాత ఇంక ఏమి అనుకున్నా ఏమి జరిగినా ప్రయోజనం లేదు. సహనంతో భరించే శక్తి ఉంటే జీవచ్ఛవంలా బ్రతికేది! లేనినాడు ఇదిగో ఇలాగే అనుక్షణం బాధతో కుమిలిపోయేది.

"మన పెళ్లి జరిగి అయిదేళ్లయింది. ఇంకా మీరు నన్నర్థం చేసుకోలేదంటే అది నా లోపం కాదు!"

"అవును! అంత సంతోషంగా వస్తున్నానని చెబితే నీవు అలానేనా ఉండవలసింది?"

ఇంకా తనకి సమర్థించుకునే అతన్ని చూస్తుంటే చిత్రంగా అనిపించసాగింది సుశీలకు.

"ఇదంతా నా అదృష్టం! నన్నెవ్వరూ అర్థం చేసుకోరు! నే నేం చేయను!" క్రాపులోకి వేళ్ళు పోనిచ్చి బాధగా కూర్చున్న అతన్ని ఆ భంగిమలో చూడగానే, ఆమెలో అంతవరకూ చిందులేస్తున్న కోపం కాస్త జారిపోయింది. దానిస్థానం జాలి ఆక్రమించింది.

అక్కడినుండి హాల్లోకి వచ్చింది సుశీల. ఎదురుగా టేబుల్‌మీద రోస్‌కలర్‌లో ఉన్న పాకెట్ ఆమెను ఆకర్షించింది. వద్దనుకుంటుంటే విప్పి చూసింది. లేతఆకుపచ్చని రంగులో జరీబోర్డర్ ఉన్న జార్జెట్ చీర! సుశీల పెదవులపై వ్యథతోకూడిన చిరునవ్వు తారట్లాడింది.

* * *

చెంపకు చేయి ఆనించుకుని కిటికీలో నించి దేన్నో పరికిస్తూ ఆలోచిస్తోంది సుశీల. ఆమె ఆలోచనలన్నీ శంకరం చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి.

'శంకరం ఉద్రిక్తస్వభావులు! ఏ భావమూ ఆయనలో ఎక్కువసేపు కాపరం చేయదు. తనంటే ఎంత అనురాగమున్నదో, అంత అనుమానం ఉన్నది. తనని ఎంత ప్రేమిస్తారో, అంత అవమానిస్తారు కూడా. ప్రేమ ఉన్నచోట స్వార్థం ఉంటుందంటారు. కానీ, అవమానంకూడా ఉంటుందని విశదపరుస్తున్నారాయన! కానీ. . . తన హృదయం ఆ రెండిటినీ సహించేస్థితిలో లేదు. తనకు కావలిసింది, అనురాగం వ్యక్తమయ్యేచూపులు, ఆదరణ గోచరించే చేతలు, సస్నేహం చిందులాడే మాటలుగల సంపూర్ణవ్యక్తిత్వం ఉన్నమనిషి! ఎంత సరిపెట్టుకుందామన్నా ఆ కఠినోక్తులను భరించలేనిదే అవుతూంది." బరువుగా నిట్టూర్చింది సుశీల.

> కన్నీరు
> కన్నీటితో నిండితే ప్రేమ
> సౌందర్యం పెంపొందుతుంది.
> —సర్ వాల్టర్ స్కాట్

దూరాన పశ్చిమాకాశంలో అరుణిమ అలుముకుంది. పక్షులు ఆత్రంగా గూళ్లవైపు పరుగులు తీస్తున్నాయి. కళ్ళు ఆర్పకుండా అటేచూస్తూ కూర్చుంది సుశీల.

"నీ ఆలోచనలకు అంతు అంటూ ఉన్నదా?"

త్రుళ్ళిపడి వెనుదిరిగింది సుశీల.

శంకరం!

"సినిమాకి వెళదామా?" అడిగాడు.

విస్తజస్కంగా చూసింది అతని వైపు.

"రాలేను"

"కారణం?" అమాహ్యంగా మారిపోయింది అతని వైఖరి.

"ఉత్సాహంగా లేదు!"

"అదే ఎందుకని అడుగుతున్నాను!"

"ఏమో!"

"ఏమిటా కుంటిజవాబు? విశదంగా చెప్పలేవా?"

కొన్ని క్షణాలు నిశ్శబ్దం తల నిరబోసుకుంది.

"ఎందుకనో జీవితంపై ప్రీతి అనేది జారిపోతూంది నా లోంచి దాని స్థానంలో, నిర్లక్ష్యం, విరక్తి భర్తీ అవుతున్నాయి." శంకరం తెల్లని ముఖం జేవురించింది.

"నాతో అంత విసిగి వేసారిపోయావన్నమాట! అంత ఇష్టంలేని కాపురం నీవు మాత్రం ఎన్నాళ్ళు చేస్తావులే!" విసురుగా వీధిలో వెళ్లిపోయాడు.

నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోయింది సుశీల.

"అలా మాట్లాడటం అతనికి వినటం, తనకి అలవాటు అయినా ప్రతిసారీ ఏదో ఒకమాట గుండెను చీల్చుకుని ఆత్మకు నాటుకుంటూనే ఉంటుంది. అంత తీవ్రంగా తను స్వీకరించకూడదని ఎంతగానో నిగ్రహించుకోటానికి ప్రయత్నించింది. అభిమానం, తన సంకల్పబలంకంటే శక్తిగలది. తనమనసు తన అదుపులో లేదు! దాని ఇష్టారాజ్యంగా ఆచరిస్తోంది సినిమా.

'తను నిరాకరించటంటే అంత కోపం వచ్చిందే! ఆయన చర్యలలో దాదాపు ప్రతిరోజూ అదే భావం ద్యోతకమవుతూంది. దాన్ని తనెలా భరించటం? అబ్బ! మాటలకే తనిలా మనస్సు పాడుచేసుకుంటూంది కదా! నాయనమ్మ అంటూ ఉండేది. పూర్వపు రోజుల్లో దెబ్బలుకూడా తినేవాళ్లమని. అలాంటి అనుభవమే తనకు కలిగితే?'

తక్షణం విషం తీసుకుంటుంది!

స్త్రీకి అంతకంటే ఘోరావమానం వేరొకటి లేదు!

'మగవాడు తానొక స్త్రీకి భర్తనన్న హోదాను, అధికారాన్ని సమాజం ఎదట రుజువు చేసుకునేందుకు గాను భార్యల్ని చావగొట్టడం! అలా చితగ్గొట్టినా భరించగలిగారంటే, వ్యక్తిత్వం చంపుకుని బ్రతికేందుకు సిద్ధపడ్డారన్నమాట! ఇది పూర్వం! ఇప్పుడు మనుషులు మారారు!పరిస్థితులు మారాయి.ఆలోచనలు మారాయి!'

సనాతన స్త్రీకి ఆధునిక స్త్రీకి ఒక్క విషయంలో గట్టి తేడా కన్పిస్తోందివాడు. పూర్వం స్త్రీలకు ఆలోచనాపరిధి తక్కువ! ఎంతసేపూ భర్తదేవుడు! ఏం చేసినా పడిఉండటమే తన ధ్యేయం! ఎన్ని అవలక్షణాలున్నా అతడు మగమహారాజు! తనని పోషించేవాడు అంతే!

ఆధునిక స్త్రీ ఆలోచనా స్రవంతికి అవధులు లేవు. స్వశక్తిమీద నిలబడగల ధీమా, హీనంగా అవమానిస్తే సహించలేని అభిమానం, ఎదటిమనిషిని అర్థంచేసుకోగల ఆత్మవిశ్వాసం, సంస్కారం ఆమెను చైతన్యవంతను చేశాయి.

ఆ అభివృద్ధిని సహించలేని పురుషులు తయారవుతున్నారు! కాలంతోపాటు తాము మారవచ్చు! స్త్రీలు మాత్రం తమ పాదసేవలోనే తరించాలి!

స్నేహితులతో, సినిమాలూ, షికార్లూ, పేకాట వాళ్ల జన్మహక్కు!

దగ్గిరలో ఉన్న మహిళామండలి భార్యకు నిషిద్ధమైన వస్తువు!

భార్యను ఎన్నైనా నిందించవచ్చు, కించపరచవచ్చు. వీలైతే చావగొట్టవచ్చు! కానీ—

తిరిగి ఆమెనుండి తనకు విరుద్ధమైన మాట వెలువడకూడదు! పొరపాటున బహిర్గతం అయినా క్షమార్హం కాదు.

స్త్రీ అలా కాదు! ఎంతటి అవమానమయినా ఆవేదన అయినా భరించి ఏదో ఒక సమయంలో అతన్ని మనస్ఫూర్తిగా క్షమిస్తుంది. అది ఆమెలోని పవిత్రతకు, ప్రత్యేకతకూ నిదర్శనం! ప్రతి చిన్న పొరపాటుకు బయటపడతాడు మగవాడు. మనస్సులో జరిగే సంఘర్షణను బహిర్గతం కాకుండా చేసుకోవటం స్త్రీకి సులభసాధ్యం! నవ్వు వచ్చింది సుశీలకు! స్త్రీపురుష మనస్తత్వాలపై పరిశోధన చేస్తోందేమిటి ఈ రోజు?

ఆనందం అనుభవిస్తారు చాలామంది, ముందు కష్టాలు రావనే నమ్మకంతో. తన బ్రతుకు అలా కాదు. ఇంకో క్షణంలో జరిగే మార్పు తనకు సుగ్రాహ్యమే.' సునీలలో అభిమానం ఉడుకులెత్తుతూంది. ఏదో ఒకటి చేసెయ్యాలనే తపన తల ఎత్తింది. ఆలోచనలు ఆమెను వదలనంటున్నాయి. ఆ స్రవంతిలో ఎంతకాలం అలా ఉండిపోయిందో ఆమెకే తెలియదు. గోడ గడియారం గంటలకు ఉలిక్కిపడి తల ఎత్తి చూసింది. ఎనిమిది గంటలయింది. "అవును! అంతే తనిప్పుడు చేయవలసింది. మనిషి దూరమయితే గానీ మమత ప్రేమ బయల్పడవు. తను వెళ్లిపోతే ఏం చేస్తాడతను? ఎవర్ని సాధిస్తాడు? చూద్దాం!' డ్రాయర్ సొరుగు లాగింది. పెన్ను, కాగితం తీసుకుంది.

"కొన్నాళ్లు మా అమ్మ దగ్గర ఉండాలనిపిస్తూంది. ఏలూరు వెళుతున్నాను. సునీల! రెండే రెండు పంక్తులు వ్రాసి టేబుల్ మీద ఉంచింది. దృఢనిశ్చయానికి వచ్చి సూట్‌కేస్‌లో చీరలు సర్దుకుంది. వాకిట్లోకి నడిచింది.

• • •

చేతుల్లోకి కాగితాన్ని తీసుకుని మరోసారి చదువుకున్నాడు శంకరం. ఇది తన తొందరపాటు ప్రవర్తనకు పర్యవసానమని గ్రహించటానికి ఎక్కువ కాలం పట్టలేదు. నిస్సారంగా కుర్చీలో కూలబడ్డాడు. తన కోపాన్ని ఇంత తీవ్రంగా తీసుకుని ఇలా ప్రవర్తిస్తుందని అందునా ఇలా వెళ్లిపోయేంత సాహసం చేస్తుందని ఊహించలేకపోయాడు శంకరం. ఆమె అలా వెళ్లిపోయినందుకు బాధ, కోపం రెండూ అతనిలో చోటు చేసుకున్నాయి. ఆ పూటకి అన్నం తినబుద్ధి పుట్టలేదు. అలానే పడుకున్నాడు.

• • •

ఏలూరు వచ్చిందన్నమాటే గాని సునీలలో ఉత్సాహం అన్నది ఏ కోశానా లేదు. తను చెప్పకుండా ఇలా



వచ్చేయడంలోని పొరపాటును, ఈ పరిణామాన్ని శంకరం ఎలా భావిస్తాడో అనే ఆందోళనవల్లకూడా సునీల మరింత ఉదాసీనమయింది. శాంతమ్మకు కూతురి ప్రవర్తన ఎంతకీ అర్థం కాలేదు. గుచ్చి గుచ్చి అడిగినా తగిన సమాధానం రాబట్టుకోలేకపోయింది. పరంధామయ్యగారికి అటులాంటి విషయాలే పట్టవు. ఎంతసేపూ కోర్టు, కేసులు, పార్టీలు! ఇంటి విషయాలలో జోక్యం కలిగించుకోరు. సునీల కెవరూ తోబుట్టువులు లేకపోవటంతో తనమనసులోకి అశాంతిని బహిర్గతం చేసుకునే అవకాశం కలగలేదు. తల్లితో చెప్పలేదు. ఆమెలోని సనాతనత్వం తనలో చెప్పలేనన్ని లోపాల్ని, తప్పుల్ని ఎంచుతుంది. ఎటూ తోచని పరిస్థితిలో తనలోనే కుమిలిపోయింది సునీల. 'తను వచ్చి ఇవాల్టికి నాలుగు రోజులు. ఇంతవరకూ అతని వద్దనుంచి ఎటువంటి సమాచారం అందలేదు. కనీసం కార్డుముక్కయినా వ్రాయలేదు. అంటే తనతో అతనికి నిమిత్తం లేదన్నమాట! అవసరం కన్పించలేదా తనతో? తను ఉన్నా, ఊడినా ఒక్కటేనా? ఎంతటి భయంకరమైన విషయం ఇది! ఒక వ్యక్తిచేత అమితంగా ప్రేమించబడుతూ, మరల ఆ వ్యక్తే, అవమానిస్తూ ద్వేషిస్తూంటే మనిషై పుట్టినవారు అందునా మనసు మానవత్వం గలవారు ఎలా భరించ గలరు?' లేతఎండలో వింతగా మెరుస్తూ, చలిస్తూన్న గులాబీమొక్కలవైపు చూస్తూ అనుకున్నది సునీల.

"అన్నిటికన్నా విచిత్రమనిపించేది మనసు. అది ఏ క్షణాన ఏ రూపం ధరిస్తుందో అనూహ్యం. ఆనందంలో ఉన్నప్పుడు కష్టాలకు మరుస్తుంది.. దుఃఖంలో ఉన్నప్పుడు అంతవరకూ అనుభవించిన సుఖాల్ని విస్మరిస్తుంది. ఇంతటి చంచలమయిన మనసుగల మనిషి ప్రవర్తనకు ప్రతిరూపం తను!

దీనికంతటికీ ఒకటే మార్గం గోచరిస్తూంది. మనసునుఅదుపులోకితెచ్చుకున్నప్పుడే, మనిషినిర్వికారంగా ఉండగలడు. ఉన్నంతలో సంతృప్తితో లేనిదానికి పాకులాడక, జరుగుతున్న సంఘటనలలో మంచినే గ్రహించగల నైపుణ్యం ఎవరికి కరతలామలకమో? వారే నిజమైన జీవితాన్ని అనుభవిస్తున్నవారు.

శంకరం వెన్నెలయితే, అతని దురుసుప్రవర్తన నీడవంటిది. తను ప్రతి మాటకు సున్నితంగా బాధపడి నందువల్ల ప్రయోజనం శూన్యం. ఆయన ప్రవర్తనను ప్రతిసారీ కొత్తగా తీసుకుని మనశ్శాంతి కోల్పోవటం అవివేకమే. అది అతని మనస్తత్వం. అంతే! అనే నిర్ధారణకు రావాలి.' నిశ్చలంగా అనుకున్నది సునీల గులాబీలవైపు తదేకంగా చూస్తూ. ఆమె మనసులోని భారాన్ని కొంత తేలిక చేసింది నిశ్చయం.

సూట్‌కేస్‌లో చీరలు సర్దుకుంటున్న కూతుర్ని చూసి వింతగా అడిగింది శాంతమ్మ.

"నేను వెళ్లాలమ్మా! ఎలా ఉన్నారో ఏమో! హోటల్ తిండితినే మనిషి కాదు. అప్పుడే నేను వచ్చి నాలుగు రోజులు!" అన్నది నీల. 'నాలుగు యుగాలు' అని మనసులో అనుకుంటూ.

• • •

గోడవైపు తిరిగి పడుకున్న శంకరం సునీల వచ్చిన అలికిడికి ఇటు తిరిగాడు. నాలుగు కళ్లూ కలుసుకున్నాయి. సునీల కళ్లు చెమర్చాయి. శంకరం పరిస్థితిని చూడగానే ఇదంతా తన అవివేకపు ప్రవర్తనకు ఫలితమా అనిపించసాగింది. ఎన్నో చెప్పాలనీ, అడగాలనీ అనిపించింది. కానీ ఒక్క మాటా నోట్లోంచి ఊడిపడలేదు.

"నేను వచ్చేశాను." విశ్వప్రయత్నంమీద ఈ మాట అనగలిగింది.

శంకరం ఈ నాలుగు రోజులూ ఎంత వ్యధ చెందిందీ అతనిరూపమే చెపుతూంది. రమ్మన్నట్లు చేతులు చాపాడు అతని కళ్లల్లోకి పరిశీలనగా చూసింది. సహజకాంతితో అనురాగాన్ని వ్యక్తపరుస్తున్నాయాతని చూపులు. కోపం కానీ, అశాంతిగానీ ఏ కోశానాలేవు అతనిలో. మెల్లిగా అతన్ని సమీపించి అతని సందిట్లో ఇమిడిపోయింది సునీల.

శంకరం నెమ్మదిగా జీరబోయిన స్వరంతో అన్నాడు "ఇంకెప్పుడూ ఇలా చేయకు! ఇంత కఠినమయిన శిక్ష భరించలేను. ఆవేశంలో, కోపంలో ఏమయినా అన్నా మనసులో పెట్టుకోకు! అది నా స్వభావం. ఆ క్షణంలో నా స్థితి నాకే తెలియదు. కానీ, అప్పటి నా ప్రవర్తనకు తరవాత ఎంత బాధపడతానో నేను వర్ణించలేను. ఇది నా లోని లోపమన్నా బలహీనత అన్నా ఒప్పుకుంటాను... ఈ నా లోపాన్ని మంచిగా స్వీకరించలేవా సునీలా?"

సునీల కళ్లు చెమర్చాయి. అవి దుఃఖాశ్రువులు కాదు. లమిత దుఃఖంవలెనే అమితమైన ఆనందము భరించలేదు మనసు. పరిమితమైన దాన్ని తప్ప దేన్నీ నిభాయించుకోలేదు హృదయం. సునీల ఆనందాశ్రువులు రాల్చింది. మనసు వెన్నెలలో విహరిస్తున్నట్లు అనుభూతి చెందింది. పెదవులను ఎలాగో విడదీసి "నన్ను క్షమించరూ!" అనగలిగింది. ★

